రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్ : టమాటా కిలో రూ.19, నల్లవంకాయ రూ.45, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 60, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 21, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నియామకం


రవీందర్ నాయక్

రాంగోపాల్‌పేట్: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ధారావత్ రవీందర్‌నాయక్ ఎన్నికయ్యారు. గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నికల్లో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తొర్రూర్ గ్రామానికి చెందిన రవీందర్‌నాయక్ జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్‌లో సహాయ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

నామినేటెడ్ రేసులో ఓయూ విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నూతన ప్రభుత్వంలో పలువురు ఓయూ విద్యార్థులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. శుక్రవారం ఓయూలో చనగాని దయాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన విద్యార్థి నేతలకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లభించలేదన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం ఉద్యోగాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పోరాడిన తనతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించినందున విద్యార్థి నేతలు రేసులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రద్దీకి ప్రత్యామ్నాయమేదీ ?

ఎంఎంటీఎస్, మెట్రోరైళ్లు, ఆటోలు, క్యాబ్‌లు నగరంలో రవాణా మార్గాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఎదుట రద్దీ బస్సులదే. రాష్ట్రం నుంచి కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి రైలుమార్గాల ద్వారా సికింద్రాబాద్‌కు చేరుకునే ప్రతీ 10 మందిలో ఆరుగురు ప్రయాణికులు సిటీ బస్సులపై ఆధారపడుతుండటం గమనార్హం. నగరం నలుమూలలకు వెళ్లేందుకు ఇక్కడి నుంచి బస్సులు అందుబాటులో ఉన్నాయి. దీంతో నగరానికి తొలిసారి వచ్చే వారు సైతం కేవలం బస్సు నెంబరు ఆధారంగానే గమ్యస్థానానికి చేరుకుంటున్నారు. ఫలితంగా సమయం, సందర్భం లేకుండా అన్ని రోజుల్లోనూ ఇక్కడి నుంచి కిక్కిరిసిన ప్రయాణికులతో సిటీ బస్సులు బయలుదేరుతుంటాయి. అసలే బస్సుల కొరతతో స్టేషన్ ఎదుట అధిక సంఖ్యలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సికింద్రాబాద్

- రైల్వేస్టేషన్ ఎదుట గందరగోళం
- బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- మహిళలకు ఉచిత ప్రయాణంతో సమస్య మరింత జటిలం
- బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్


సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 21 బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల రద్దీ

◆ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఐదు బస్‌స్టాప్‌ల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు సిటీ బస్సులు బయలుదేరుతున్నాయి. మేడ్చల్, కూకట్‌పల్లి, అఫ్జల్‌గంజ్, ఈసీఐఎల్, ఉప్పల్, మెహిదీపట్నం, చార్మినార్ ప్రాంతాల మీదుగా వివిధ మార్గాలకు ప్రయాణించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బస్సులు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్క రైలు ప్రయాణాలే కాకుండా గాంధీ ఆసుపత్రి, మోండా మార్కెట్, వివిధ వ్యాపార వాణిజ్య అవసరాల నిమిత్తం ఆర్టీసీ బస్సుల ద్వారా వందలాది మంది ప్రయాణికులు రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. సాధారణ సమయాల్లోనే రద్దీగా ఉంటున్న సిటీబస్సులు సెలవు దినాల్లో మరింత రద్దీతో బయలుదేరుతున్నాయి.

వేయికి పైగా ట్రిప్పులు..

◆ నగరంలోని వివిధ డిపోలకు చెందిన రెండు వందల సిటీ బస్సులు నిర్ణీతమార్గాల్లో రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగిస్తున్నాయి. సిటీబస్సులు, మరో వంద వరకు సెట్విన్ బస్సులు కలుపుకుని మొత్తంగా వేయి వరకు బస్సులు ట్రిప్పులు నడుస్తున్నా.. ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. పండగలు, సెలవు దినాల్లో ఈ సమస్యలు మరింత జటిలంగా మారుతోంది. సుదూర ప్రాంతాల నుంచి రైళ్లలో నగరానికి చేరుతున్న సందర్భాల్లో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన మహిళల తాకిడి..

◆ ఎప్పటికప్పుడు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడం, ఇబ్బందులు యథాతథంగా ఉంటుండటం ఇక్కడ మామూలైంది. తాజాగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ ప్రయాణాలను ఉచితం చేసింది. ఈ నేపథ్యంలో వివిధ వ్యాపార వాణిజ్య అవసరాల కోసం సిటీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య రెట్టింపు అయ్యింది.

◆ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్న సిటీ బస్సుల్లో మహిళల సంఖ్య పురుషుల కన్నా ఎక్కువగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. సెలవు దినాల్లో ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులను అదుపు చేయడం కష్టసాధ్యం అవుతుందని వారు చెబుతున్నారు.

బస్సుల సంఖ్యను పెంచాలి..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సిటీ బస్సులు అందుబాటులో లేవు. ఇప్పటికే తమకు ఇబ్బందులు ఎదురౌతుండగా మహిళలకు ఉచిత ప్రయాణంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెలవు దినాల్లో ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితులను అదుపు చేయడం కష్టసాధ్యం అవుతుందని వారు చెబుతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణాలను స్వాగతిస్తున్నామని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి తమకు న్యాయం చేయాలని ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ట్రాక్‌సూట్, నగదును అందజేస్తున్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: కంటోన్మెంట్ స్పోర్ట్ అసోసియేషన్ పాఠశాల స్థాయిలో విద్యను అభ్యసిస్తూ.. క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. బోయిన్‌పల్లిలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో ఉంటూ.. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న కొర్రచంటి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొర్ర చంటికి ట్రాక్‌సూట్, నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. భవిష్యత్తులో కబడ్డీ పోటీల్లో జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు గణపతిశర్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫ్రక్, స్థానిక నేతలు సాదీక్, సీరాజ్, మున్నా బాయ్, రాజేష్ సుదర్శన్ తదితరులున్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఏఎంహెచ్ఓ



లాలాపేట: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓగా ఇటీవల నూతనంగా నియమితులైన వెంకటరమణ శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓయూలో అంతర్జాతీయ సదస్సుపై విమర్శలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు పలు విమర్శలకు దారి తీసింది. క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో రిసెంట్ అడ్వాన్సెస్ ఇన్ జువాలజీ–ఇన్నోవేషన్స్ ఛాలెంజస్ అండ్ అపార్చునిటీస్ అనే అంశం ఈనెల 20న ప్రారంభమై శుక్రవారం ముగిసింది. అంతర్జాతీయ సదస్సు అంటే విదేశాలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని, ఒక్కరు కూడా విదేశీయులు హాజరు కాలేదని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని సదస్సుకు హాజరైన విద్యార్థులు అధికారులను కోరారు.

మూడు దేశాల నుంచి పరిశోధనా పత్రాలు..

ఓయూ జంతుశాస్త్రం విభాగం 99 ఏళ్లు పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు 350 మంది ప్రతినిధులు హాజరు కాగా యూఎస్ఏ నుంచి 3 పరిశోధన పత్రాలు, ఆస్ట్రేలియా, జర్మనీ నుంచి ఒక్కొకటి వచ్చినట్లు హెడ్ ప్రొ.మాధవి వివరించారు.

టీకాలతో 95 శాతం మరణాలను తగ్గించొచ్చు

యశోద ఆసుపత్రి ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హరికిషన్

రాంగోపాల్‌పేట్: పెద్దవారికి ఇచ్చే టీకాలతో 95 శాతం మరణాలను నివారించవచ్చని యశోద ఆసుపత్రి ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఫైజర్ కంపెనీ డాక్టర్ సంతోష్‌తార్‌తో కలిసి మాట్లాడారు. చిన్న పిల్లలకు టీకాలపై దేశంలో అవగాహన ఉందని, పెద్దవాళ్లలో టీకాలపై అవగాహన లేదన్నారు. ఫైజర్ కంపెనీ, యశోద ఆసుపత్రి సంయుక్తంగా పెద్దల్లో టీకాల గురించి అవగాహన కల్పించేందుకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ' ఏర్పాటు చేసినట్లు వివరించారు. టీకాలను ముందుగా వైద్యరంగంలో ఉన్న వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన అనంతరం ప్రజల్లో దీన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని నిశ్చయించామన్నారు. 50 ఏళ్లు పైబడిన వాళ్లు, మూత్ర పిండాల వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు టీకాలను తీసుకోవడం ద్వారా ప్రాణాపాయంతో పాటు వైద్యానికి అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ టీకాలు ఒకసారి తీసుకున్న తర్వాత ఐదు నుంచి ఏడేళ్ల వరకు పనిచేస్తుందని అటు తర్వాత వైద్యుల సలహా మేరకు అవసరమా లేదా అనేది తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. గత 10–15 ఏళ్ల నుంచి ఈ టీకాలను వినియోగిస్తున్నా.. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ కనిపించలేదన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రతి ఏటా 6 నుంచి 8 లక్షల మంది ఇన్వసీవ్ న్యూమో కాక్కల్ వ్యాధుల కారణంగానే మృత్యువాతపడుతున్నట్లు తేలిందని వివరించారు. యశోద ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ శ్రీధర్ తదితరులున్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

పద్మారావునగర్: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను బోలక్‌పూర్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ పాఠశాలలో ఈ వేడుకల్లో భాగంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో గణితం నమూనాలు, చార్టులు, ప్రయోగాల చార్టులను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణితం అంటే భయాన్ని వీడి సులువుగా వాటిని నేర్చుకునే ప్రయత్నం చేయాలని కోరారు. గణితం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆవరణలో ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. పెద్దఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ


నామాలగుండు కల్యాణ వెంకన్నస్వామి ఆలయంలో..


వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తిరుపతి సెట్టింగ్

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

చిలకలగూడ: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా చిలకలగూడలోని పలు ఆలయాల వద్ద ఆధ్యాత్మికశోభ నెలకొంది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి ఉత్తర ద్వార దర్శనానికి తగిన ఏర్పాట్లు చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు అనుమతినిస్తున్నట్లు నామాలగుండు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు ప్రకటించారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ కందిశైలజ అధికారులకు సూచించారు. గొల్లపులయ్య బావిలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు వీలైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రియాంక, బీఆర్ఎస్ నాయకుడు సురేష్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న రవిసుధా నాట్య ప్రదర్శన


నాట్య ప్రదర్శనలో చిన్నారి కళాకారులు

లాలాపేట: కూచిపూడి కళామిత్ర ఆధ్వర్యంలో శిల్పారామంలో నిర్వహించిన రవిసుధా నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తార్నాకకు చెందిన సిరిబాల, క్రాంతికిరణ్‌ల కుమార్తె మిషికా కెంబాసరం మూడు విభాగాల్లో పాల్గొని తన నాట్య ప్రతిభను చాటి ఆహుతులను మెప్పించారు. నాట్య గురువు అమ్రితాసింగ్ తదితరులున్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయం


చిలకలగూడ సీఎస్ఐ వెస్లీ చర్చిలో..


మాట్లాడుతున్న జయకర్ డేనియల్


సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి

చిలకలగూడ: సీఎస్ఐ వెస్లీ చర్చిలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చితో పాటు క్రిస్మస్ ట్రీని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పాస్టర్లు రెవరెండ్ డాక్టర్ ప్రసన్నకుమార్, రెవరెండ్ జాక్వెలిన్, రెవరెండ్ దీపక్‌డొనాల్డ్‌సన్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననం శుభ సంకేతమని, ఆయన బోధనలు సర్వ మానవాళికి ఆచరనీయమన్నారు. సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా హాజరై క్రిస్మస్ కేక్‌కట్ చేసి ఆటపాటలతో సందడి చేశారు. సత్యానందం, బెంజిమన్‌జ్యోతి, బెన్‌హర్, విల్సన్‌వినయ్‌సాగర్, జేపీ సుధాకర్, జోనావిన్సెంట్ తదితరులున్నారు.

రాంగోపాల్‌పేట్‌లో..

రాంగోపాల్‌పేట్: సమాజంలో ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో వైఎంసీఏ, యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ మినిస్ట్రీ ప్రతినిధి సిస్టర్ జాయ్ చెరియన్, జాకబ్ చిన్నప్ప, వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లెనార్డ్ మైరిన్, కార్యదర్శి కల్యాణ్ తదితరులున్నారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: క్రిస్మస్ శోభతో నియోజకవర్గ ప్రాంత రహదారులు సందడిగా మారాయి. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలను విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా, ఫ్లైఓవర్ పక్కన ఉన్న మెథడిస్ట్ చర్చి, ఎండీ ఇమానుయేల్, సీఎస్ఐ, బాప్టిస్టు, బల్కంపేట్‌లోని యునైటెడ్ ఇండిపెండెంట్, యేత్రోను చర్చిలతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి.

షాపింగ్ సందడి...

● అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, బేగంపేట్, సనత్‌నగర్ ప్రాంతాల్లో ఏ వీధిలో చూసినా కిస్మస్ సంబంధిత వస్తువుల కొనుగోలుదారులతో సందడిగా మారింది. ఆకర్షణీయమైన రంగుల్లో క్రిస్మస్ ట్రీ అలంకరణ సామగ్రి చూపరులను కట్టిపడేస్తున్నాయి. అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో స్టార్స్, క్రిస్మస్ సామగ్రి లభ్యమవుతున్నాయి. రూ.20ల నుంచి రూ.500ల వరకు ఉండగా.. క్రిస్మస్ ట్రీ రూ.50ల నుంచి రూ.1000ల వరకు లభిస్తున్నాయి. అలంకరణ సామగ్రి రూ.50 నుంచి రూ.500ల వరకు ఉన్నాయి.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు..

లాలాపేట: తార్నాక వ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. తార్నాకలోని బాప్టిస్టు చర్చి, ఐనోస్ చర్చి, లాలాపేట వినోభానగర్‌లోని మెథడిస్ట్ చర్చి, శాంతినగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చి, ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. సెమీ క్రిస్మస్, యూత్ క్రిస్మస్ వేడుకలను చర్చిల్లో సందడి వాతావరణం నెలకొంది. యేసురత్నం, సామ్యేల్, రంగారావు, విజయ్, స్థానిక నాయకులు అంజయ్య, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.


ఫ్లై ఓవర్ పక్కన ఉన్న మెథడిస్ట్ చర్చి


మార్కెట్‌ను ముంచెత్తిన స్టార్స్, బెల్స్


శాంతినగర్ ఎస్ఎఫ్ఎస్ చర్చి

త్వరితగతిన పనులను పూర్తి చేయాలి


జలమండలి అధికారులతో కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ నవ్యలతో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీరు, మురుగు, లోప్రెషర్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వేళలను నవరించాలని సూచించారు. దశలవారీగా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని డీజీఎం కృష్ణ హామీ ఇచ్చారు.

యువత అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్

రసూల్‌పురా : నేటి యువత స్పష్టమైన అవగాహన, సమర్థతో తమ లక్ష్యాలను చేరుకుని సాధించాలని హైదారాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ సూచించారు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హైదరాబాద్ జిల్లా యువజన మరియు క్రీడా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని గెలుపోటములను సమంగా స్వీకరించి లక్ష్యసాధనలో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో యువతకోసం భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందించి సహకరిస్తామన్నారు. జిల్లా క్రీడా అధికారి ఎన్.సుధాకర్ మాట్లాడారు. జానపద నృత్యం, గీతం, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ఫోటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత భగవాన్‌దాస్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి


నివాళులర్పిస్తున్న అడ్డగుట్ట కాంగ్రెస్ నాయకులు

అడ్డగుట్ట: మాజీ కేంద్రమంత్రి జి. వెంకటస్వామి (కాకా) 9వ వర్ధంతి సందర్భంగా అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం అడ్డగుట్ట కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గంట రాజుసాగర్ నేతృత్వంలో హైద్రాబాద్ ఎస్సీసెల్ జాయింట్ కన్వీనర్ భూపతి హరి, సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనంత కృష్ణారావు, నవీన్ వెంకటస్వామి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపొద్దు


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న కార్డినల్ పూల ఆంథోని

రాంగోపాల్‌పేట్: లింగ బేధం లేకుండా సర్వమానవాళిని ఏసుక్రీస్తు ప్రేమించిన విధంగానే సమాజంలో ఉండే ట్రాన్స్‌జెండర్స్ పట్ల సమాజం వివక్షను చూపకుండా కలుపుకుని పోవాలని కార్డినల్ పూల ఆంథోని సూచించారు. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్డీరోడ్డులోని కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్‌తో సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పూర్తి చేసికున్న 6 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు జ్యూట్ బ్యాగ్ తయారీ మిషన్లను అందించి, 65 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు రేషన్ కిట్స్‌ను అందించారు. మహిళా సాధికారతలో భాగంగా 14 మందికి కుట్టు మిషన్లను అందించారు. ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి తాషి మాట్లాడుతూ.. కుల, మతాలకు అతీతంగా హాస్ చేస్తున్న సేవపట్ల హర్షం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ ఫాదర్ బాలా, డైరెక్టర్ ఫాదర్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.